# కాటుక కంట నీరు

శ్రీనివాసు క్లాసులో వుండగా కబురొచ్చింది కరస్పాండెంట్ జగన్నాథం పిలుస్తున్నాడని. ఓ అయిదు నిముషాల్లో క్లాసు ముగించుకొని అతని దగ్గరి కెళ్లాడు.

" సీ ! శ్రీనివాస్ ! ఓ చిన్న హెల్ప్ చెయ్యాలి" జగన్నాథం చెప్పాడు.

" చెప్పండి" ఎగ్స్ట్రా క్లాసులు తీసుకోమంటాడేమోనని భయపడుతూ అడిగాడు. శ్రీనివాసు ఆ పబ్లిక్ స్కూల్లో చేరి ఆరునెలలు కాలేదింకా. లెక్కల మాష్టార్లు కావాలి అని కబురు పెడితే జీతం కొంచెం ఎక్కువ యిస్తానంటే వేరే ఊరు నుంచి ఆ వూరుకు వచ్చాడు. అతని లోకం లెక్కల లోకం తన జీతానికి తగ్గ శ్రమ కంటే ఎక్కువ శ్రమ పడుతున్నాడు. స్కూలుకు మంచి పేరు తేవాలని అరటిపండు వలచి పెట్టినట్లు చెబుతున్నాడు మ్యాథ్స్!

" రేపటి నుండి టెన్త్ పబ్లిక్ జరుగుతుంది..."

" అవును సార్. బాగా రివిజన్ కూడా చేశాను సబ్జక్టు"

" అది కాదు నేను అనేది... మీ పరీక్ష వచ్చినప్పుడు మీరు సెంటర్ దగ్గరికి వెళ్లాలి. మనవాళ్లకు తోడుగా వుండాలి" జగన్నాథం చెప్పాడు.

" కాని ఇక్కడ మిగతా క్లాసులు జరుగుతున్నాయిగా..."

" ఫర్వాలేదు. మనకిది ప్రిస్టేజ్ ఇష్యూ ! మన స్కూల్ నుంచి ఎకు&కవ మంది అత్యధిక శాతం మార్కులతో పాసు కావాలి!"

" నా వంతు కృషి నేను చేశాను..."

" నే కాదనలేను. ఎగ్జామ్ సెంటర్‌లో బయట వుంటే. పదినిముషాల్లో పేపరు బయట కొస్తుంది... క్వశ్చన్లకు ఆన్సరు చేసేస్తే మనవాళ్లు మిగతా విషయాలు చూసుకుంటారు" జగన్నాథం చెప్పాడు.

శ్రీనివాస్ షాక్ తిన్నాడు. అంటే తనను కాపీలు అందించమని చెబుతున్నాడు జగన్నాథం. తను ఇంత కష్టపడి చదువు చెబితే తన మీద నమ్మకం లేక దగ్గరుండి కాపీలు అందించమంటున్నాడు! ఛీ ఛీ ! ఇంత నీచమైన పనికి పురికొల్పుతాడా కరస్పాండెంట్.

" సార్... అది అనైతికం గదా సార్!" తలొంచుకుని అన్నాడు.

" కాని రేపు మన పిల్లలు పరీక్ష ఫెయిలయితే తల్లిదండ్రులొచ్చి మొహం మీద ఉమ్మేస్తారు. అప్పుడు ఎవరికి ఏం సమాధానం చెబుతాం! వాళ్ల పిల్లలు చదవక, తెలివి తక్కువవాళ్లు కనుక ఫెయిలయ్యారని అనుకోరు. మనం సరిగా చెప్పక తప్పారనుకుంటారు".

" అంత మొద్దు పిల్లలైతే మనమేం చేస్తాం సార్!"

" యూసీ శ్రీనివాస్ ! ఇది పబ్లిక్ స్కూల్. ఇక్కడ కంపల్సరీగా అందరూ పాస్

కావాలి. ఆ పాస్ అట్ట యిట్టా కాదు. డిస్టింక్షనులో పాసు కావాలి! అది మన బాధ్యత. ఇంక పోయి మీ పని చూసుకోండి. ఆ రోజున మటుకు సహకరించండి" కటువుగా చెప్పాడు.

శ్రీనివాస్ తలొంచుకుని బయటకొచ్చేశాడు.

అన్యమనస్కంగా మిగిలిన ఒక క్లాసు లాగించేశాడు.

ఇంటికొచ్చేసరికి విపరీతమైన తలనొప్పి వచ్చింది. ఇది ఏంటి, ఎందుకిలా జరుగుతున్నది. తను ఈ ఊరు రాకుండా ఉంటే బాగుండేది. ముష్టి అయిదొ,దలు ఎక్కువ వస్తాయని ఆశపడి అనవసరంగా ఆ విద్యాసంస్థను వదులుకుని వచ్చాడు.

ఛ! ఛ! టీచర్లే దగ్గరుండి కాపీలు అందిస్తే వాళ్ల పరువేం కాను. ఇన్నాళ్లు క్లాసులో పేముబెత్తం తీసుకుని భయపెడుతూ చండశాసనుడిలాగా ప్రవర్తించాడు. ప్రతి విద్యార్థీ తప్పనిసరిగా నేర్చుకోవాలని పట్టు బట్టి నేర్పించాడు.

తనకిదేం తద్దినం తగిలింది.

ఆ రాత్రి ఎప్పటికో గాని నిద్ర పట్టలేదు. మరునాడు రమేష్‌ను అడిగాడు. కరస్పాండెంట్ ఏమన్నా చెప్పాడా అని.

" గురూ ! నీకంటే కొత్తగాని మాకు అలవాటే !" చెప్పాడు అతను రెండేళ్లుగా అదే స్కూల్లో పనిచేస్తున్నాడు.

" అంటే మన టీచర్లే సెంటర్లు దగ్గరకు పోయి కాపీలు పంపిస్తారా!"

" తప్పదు అది మన కరస్పాండెంట్ ఆజ్ఞ!"

" చెయ్యకపోతే - నా కాన్షస్ ఒప్పుకోలేదని చెప్పేస్తా!"

" నీకేమన్నా పిచ్చా వెర్రా - ఉద్యోగం పొగొట్టుకుంటావా!" రమేష్ కోప్పడ్డాడు.

" ఇంత చిన్నదానికే ఉద్యోగం వదులుకోవాలా?"

" అవును మరి. ఇది ప్రైవేట్ స్కూల్. ఆ జగన్నాథం దయ వున్నంత కాలం మనం పని చేయగలం. అతగాడికి మనమీద కోపం వచ్చిందో మన ఉద్యోగాలు హుష్ కాకి" చెప్పాడు రమేష్.

" వాడి మొహం ! వాడు కాకపోత వాడి బాబులాంటివాడు ఇంకోడు ఇస్తాడు" ఆవేశంగా అన్నాడు శ్రీనివాస్.

" హూ ! నీలో ఇంకా కుర్రనెత్తురు చచ్చినట్లు లేదు. ఉద్యోగాలు ఈ కాలంలో అంత సులభంగా రావడం లేదు. ఈ స్కూలు మానేశావనుకో. ఇంకో స్కూలుకు అప్లై చేస్తే వాళ్లు ముందు జగన్నాథాన్ని అడుగుతారు. ఫలానా టీచరు ఎలా ఉండేవాడు. మీ స్కూలు నుంచి ఎందుకు మానుకున్నాడని. అతను నీ గురించి చెడుగా చెబితే నీకు ఉద్యోగం

ఎవరూ ఇవ్వరు. పైగా దాదాపు ఈ కాలంలో ప్రతి స్కూలు ఇలానే అఘోరిస్తున్నది." రమేష్ చెప్పి క్లాసుకు పోయాడు.

ఆ సాయంత్రం శిరీష ఇంటికి వెళ్లాడు శ్రీనివాస్ తన బాధ చెప్పుకుందామని.

శిరీష కాసేపటికి బయటకు వచ్చింది. వరండాలో కుర్చీ వేసి కూర్చోమంది. మొహం అలసిపోయినట్లు కనిపిస్తోంది.

" హలో శిరీషగారు బిజీగా వున్నారా!"

" ఆ ! మరే !"

" ఏం చేస్తున్నారు. లోపల పిల్లల గొంతులు వినిపిస్తున్నాయి" తొంగి చూస్తూ అడిగాడు.

" ఏం లేదు. పేపరు రాయిస్తున్నాను" తప్పనిసరై చెప్పింది.

" ఏం పేపరు .... మోడల్ పేపరా?"

" కాదు. పొద్దున ఇచ్చింది..."

" పరీక్ష అయిపోయిందా!"

" ఆ ! కొందరు డల్లర్సు వున్నారుగా. వాళ్లకు చెప్పి రాయిస్తున్నా!"

" నాకర్థం కావడం లేదు. ఆల్‌రెడీ పరీక్ష రాసేశారు. ఆ పేపర్లు వెళ్లిపోయి వుంటాయి"

" అంతా జగన్నాటకం ! అవన్నీ మన జగన్నాథంగారు మానేజ్ చేస్తారు లెండి" సాదాసీదాగా చెప్పింది.

శ్రీనివాస్‌కు తల తిరిగిపోయింది.

" ఛీ ! మీరు ఆదర్శవంతులైన ఉపాధ్యాయులై వుండి ఇలా చేయిస్తారా!"

" నాకిష్టముండి చేస్తున్నానా? అది బాస్ ఆర్డర్లు"

" బోడి బాసు, కాదంటే ఏవంటాడేం!"

" మాకున్న ఇబ్బందులు మాకున్నాయి. ఇంత సర్వీసు వదలుకుని ఇంకేం స్కూలుకు పోతాం. ఏదో కళ్లు మూసుకుంటే... జరిగిపోతుంది"

" ఛీ ఛీ ! మీలో చైతన్యం లేక ఇలా తగలబడింది దేశం" కోపంగా ఇంటికి వచ్చేశాడు.

ఈ అకడెమిక్ ఇయర్ కాగానే తన వూరికి వెళ్లిపోయి అక్కడ చేరదామనుకున్నాడు శ్రీనివాస్.

రపు తన పేపరు వస్తుంది.

తను పోడు సెంటర్‌కు. కాపీలు అందించడు. ఆన్సర్లు రాసి పెట్టడు.

కలత నిద్రపోయాడు.

" ఏమండీ ! బాబుకు విరోచనాలు అవుతున్నాయి. డాక్టరుకు చూపించాలి" శ్రీమతి చెప్పింది.

పర్సు వెతికాడు. ఓ పది రూపాయల నోటుంది. ఎంత లేదన్నా డాక్టరు ఫీజు ముప్పై మందులకు ఇంకో వందో ఎంతో అవుతుంది.

ఇప్పుడేం చెయ్యాలి! ఎవరిని అడగాలి! తన కొలీగులంతా తన లాంటివాళ్ళ ! ఎవ్వరి దగ్గరా పైసా దొరకదు.

ఇంక జగన్నాథం గతి ! అతను అవసరమైతే మధ్యలో కొంత ఇస్తూ ఉంటాడు. జీతంలో కట్ చేసుకుంటాడు. కాళ్ళీడ్చుకుంటూ జగన్నాథం ఇంటికి వెళ్లాడు. అతను పేపరు చదువుతున్నాడు.

" ఏం శ్రీనివాస్ ఇలా వచ్చావు"

" సార్.. ఓ రెండొందలు కావాలి!" చెప్పాడు.

" ఇస్తాలే. ఇవ్వాళ తొమ్మిదికల్లా నువ్వు సెంటరుకు వచ్చెయ్యి. నీకేం భయం లేదులే. పోలీసులేం చెయ్యరు. అందరికీ మన పేరు తెల్సు. నీడ్యూటీ నువ్వు చేయి. కానిస్టేబుల్ నీ దగ్గరికి వస్తాడు. అతనికిస్తే మిగతాది అతనే చూసుకుంటాడు" జగన్నాథం చెప్పాడు.

" కాని... నాకిటువంటివి ఇష్టం ఉండదు" చెప్పాడు బలవంతాన.

" నాకు మటుకు ఇష్టం వుందా ! నలుగురితో పాటు నారాయణ! అన్ని స్కూళ్లకు పర్సంటేజి ఎక్కువ వచ్చి మనకి రాలేదనుకో... పరువుపోతుంది" చెప్పాడు జగన్నాథం డబ్బులు అందిస్తూ.

" థ్యాంక్స్ ! " చెప్పి వచ్చేశాడు.

బాబును డాక్టరు దగ్గర చూపించి ఇంట్లో వదిలేసరికి తొమ్మిది అయిపోయింది.

ఆదరాబాదరా జగన్నాథం చెప్పిన సెంటరుకు చేరుకున్నాడు.

అప్పటికే పేపరు బయటికొచ్చి నట్లుంది.

స్కూలుకు కొంచెం దూరంగా ఎదురుగా వున్న ఓ వరండాలో కూర్చునున్నారు తన స్కూలు టీచర్లు కొంతమంది. తను రాగానే వాళ్లకి ప్రాణం లేచి వచ్చినట్లయింది.

శ్రీనివాసు పేపరు చూశాడు. అన్నీ తను చెప్పినవే! కొత్తవంతూ ఏదీ రాలేదు. గ్యారంటీగా తన పిల్లలు బాగా రాస్తారు. దాంట్లో డౌటు లేదు. బ్రిలియంటులు ఇద్దరున్నారు. వాళ్లకు సెంటు గ్యారంటీ.

" మనం అందించాల్సిన పని లేదు. పేపరు ఈజీగా వచ్చింది" చెప్పాడు పక్కనున్న రమేష్‌కు.

" భలేవాడివే.. అలా అంటే మన సారు ఊరుకోడుగా"

" అంటే బాగా రాసేవాళ్లకు అందించి వాళ్లను పాడు చెయ్యాలా" కోపంగా అడిగాడు.

" చూడు బ్రదర్! మంత్రసాని పనికి ఒప్పుకున్న తర్వాత ఏదొచ్చినా పట్టాల్సిందే! నీ

పని నువ్వు చెయ్యి. మిగతావి మేము చూసుకుంటాం" చెప్పాడు రమేష్.

శ్రీనివాసు విసుగ్గా మొహం పెట్టి ఆన్సరు చేయసాగాడు.

దాన్ని మిగతా వాళ్లు కాపీ చేయసాగారు.

ఎందుకంటే ఒకే స్కూలు పిల్లల్ని ఈ సారి ఒకే స్కూల్లో వెయ్యలేదు. రకరకాల సెంటర్లలో వేశారు. అందుకని మిగతావాళ్లు అక్కడికి పోయి అందించాలి.

" సార్ ! నాక్కొద కొంచెం చూపించండి" ఎవరో అపరిచితుడు అడిగాడు.

" హూ ఆర్ యూ!" శ్రీనివాస్ అడిగాడు.

" ఫలానా స్కూల్లో టీచర్ని. మా పిల్లలు ఇక్కడ రాస్తున్నారు. మీరిస్తే పంపిస్తాను" అతను వినయంగా చెప్పాడు.

" అదెలా కుదురుతుంది" శ్రీనివాస్ రమేష్‌ను అడిగాడు.

" ఫర్వాలేదు. ఇచ్చెయ్యి... ఇచ్చి పుచ్చుకోవాలి. లోపల ఇన్విజిలేటర్లు వీళ్ల స్కూలు టీచర్లే. వాళ్లు మనకు బాగా సహాయం చేస్తున్నారు" చెప్పాడు రమేష్.

ఎగ్జామ్ అయిన తరువాత ఇంటికి వస్తుంటే జగన్నాథం ఎదురు వచ్చాడు.

" ఓకేనా ?" అడిగాడు.

" నాకు ఓకే !" చెప్పాడు శ్రీనివాసు.

ఆ రాత్రి శ్రీనివాస్ నిద్రలేక నానా అవస్థ పడ్డాడు. కళ్లు మూసుకుంటే, పిచ్చి పిచ్చి కలలు.

ఒక కలలో సరస్వతీదేవి ఏడుస్తూ కనిపించింది. నీకు ఇది ధర్మమా అని అడుగుతున్నట్లు కనిపించింది. ఇంకో కలలో సరస్వతీ దేవి అవమానంతో పారిపోతున్నట్లు కనిపించింది. ఇంకో కలలో కలియుగంలో పాపం మరీ ఎక్కువై పోయిందని బ్రహ్మతో మొరపెడుతూ కనిపించింది.

ఆ రోజు రామబ్రహ్మం కనిపించాడు. అతను కాలేజీమేట్. అతను కూడా టెన్త్ క్లాసు ఎగ్జామ్స్‌కు ఇన్విజిలేటరుగా పని చేశాడు.

ఇద్దరూ టీ బంకుకు వెళ్లి టీ తాగారు.

" ఏం గురూ! నువ్వు నీ క్లాసులో కాపీలు కొట్టనిచ్చావా?" శ్రీనివాస్ అడిగాడు.

" ఆ ! చూసి చూడనట్లు ఊరుకోవాలిగా మరి" రామబ్రహ్మం సిగ్గుపడుతూ చెప్పాడు.

" అదేంటి ! కాలేజీలో నువ్వు ఎంత ఆదర్శ విద్యార్థిగా వుండేవాడివి. అవినీతిని, అన్యాయాన్నీ ఎంతగా ఖండిస్తూ వుండేవాడివి? నువ్వు దీనికి ఎలా రాజీపడ్డావు!" ఆశ్చర్యంగా అడిగాడు.

" డబ్బు గురూ డబ్బు! అందరికీ రెండువలు ఇచ్చారు స్కూలువాళ్లు. నలుగురితో

పాటు నారాయణ మనం వద్దని మడి కట్టుకుని కూర్చున్నా కాపీలు ఆగవు. కనీసం ఆ డబ్బున్నా తీసుకుని మన పబ్బం గడుపుకోవచ్చని ఒప్పుకున్నా!" చెప్పాడు రామబ్రహ్మం.

" ఛ ! ఛ! ఎంత దిగజారిపోయావు. కాలేజీలో నీ ఉపన్యాసాలు విని ఎంతమంది ప్రభావితులయ్యారో!"

" సరే లేవోయ్ ! నువ్వు మటుకు చేసిందేమిటి! నువ్వు మటుకు కాఫీలు పంపలేదా?" సూటిగా అడిగాడు.

ఇగో అడ్డువచ్చింది శ్రీనివాస్‌కు " అబ్బే ! లేదే!" అన్నాడు.

" గురూ ! బొంకకు. నీ దస్తూరి నాకు తెల్సు. ఒక స్లిప్‌లో నీ దస్తూరి నాకు కనిపించి సంతోషపడ్డాను. కొన్ని అంకెలు నువ్వు వేసినట్లు ఎవరూ వేయలేరు. నాకు తెల్సు!" అన్నాడు.

" తప్పలేదు. మా వాడు గట్టిగా ఏడ్చాడు" నసిగాడు.

" వాడి ఏడ్పు అటుంచు. నీ బుద్ధి గడ్డి తిందా? నువ్వెందుకు రాజీ పడాలి!"

" వాడి ఉప్పు తింటున్నాం గదాని!"

" ఛీ ! ఛీ ! నాకంటే నువ్వే ఎక్కువ దిగజారి పోయావు" రామబ్రహ్మం ఛీత్కారం చేశాడు.

నిజంగానే తన తల ఎక్కడ దాచుకోవాలో అర్థం కాలేదు శ్రీనివాసుకు.

" గొంగళిలో తింటూ వెంట్రుకలు ఏరుకోవడం ఎందుకు. వస్తా !" అతను దోవన అతను వెళ్లిపోయాడు.

ఆ రోజు శ్రీనివాసుకు కోపం వచ్చింది. రోజూ హోమ్‌వర్క్ చేసుకువచ్చే రాంచందర్ చేసుకురాలేదు.

" ఏరా రామూ ! హోంవర&్క ఎందుకు చెయ్యలేదు. ఎగ్జామ్స్ వస్తున్నాయి. కష్టపడాల్సింది పోయి తిని పడుకుంటే ఎలా?"

" చేసి ఏం ఉపయోగం సార్ !" వాడు ఉన్నట్లుండి అడిగాడు.

" వెధవా! చెయ్యనంటావా!" అంటూ పేము బెత్తంతో రెండు తగిలించాడు.

" లేదు సార్ ! నాకు చెయ్యబుద్ధి కాలేదు"

" ఎందుకురా !"

" మా అన్న ఇవన్నీ వేస్ట్ అన్నాడండి"

" ఎవడురా వాడు "

" రవి సార్ ! మొన్న పదవతరగతి పరీక్షలు రాశాడు. మనం కష్టపడితే క్లాస్ రాదన్నాడు సార్! టీచరు కష్టపడితే వస్తుందిట!"

శ్రీనివాస్‌కు తల తిరిగిపోయింది.

అప్పటి నుండి అతను మునుపటంత చండశాసనుడుగా ప్రవర్తించలేక పోయాడు. నిజమే ! తన తాపత్రయం నటనకింద వచ్చింది.

కష్టపడి పాఠాలు చెప్పి, హోంవర్క్ చేయించి, యూనిట్ టెస్ట్‌లు పెట్టి చివరికి చేస్తున్నదేమిటి?

ఏడవక్లాస్ పరీక్ష కూడా అదే పంథాలో నడిచింది. కాకపోతే ఇంకొంచెం విజృంభించారు పిల్లలు.

రాత్రికి రాత్రే పేపర్లు మారిపోయాయి. రిజల్ట్స్ వచ్చాయి.

అతని స్కూలుకు మంచి ర్యాంకులు వచ్చాయి. అందరూ క్లాసులో పాసయ్యారు.

కాని చిత్రంగా డిస్ట్రిక్ ఫస్ట్ వస్తాడనుకున్న శ్రీనాథ్ ఐదోవాడుగా వచ్చాడు ! రాత్రింబవళ్లు ఏడ్చాడు వాడు.

ఆ విషయం తెల్సి వాడింటికి వెళ్లాడు శ్రీనివాసు. ఎందుకంటే అతను అభిమానించే కుర్రాళ్ళలో అతనూ ఒకడు.

" ఏరా శ్రీనాథ్ ! లెక్కల్లో సెంటు రాలేదా!"

" రెండు మార్కులు తగ్గాయి"

" కాని పనికిరాని సుబ్బయ్యకు వచ్చిందిగా సెంట్"

" ఎందుకు రాదు సార్. ఆ పేపరు రాసింది మీరు గదా!" చెప్పాడు శ్రీనాథ్.

ఉలిక్కి పడ్డాడు శ్రీనివాసు. నిజమే ! తను కాపీలు అందించడం మూలంగా ర్యాంకర్లు వెనకబడ్డారు. యావరేజ్ వాళ్లు బాగా పైకొచ్చారు.

" వెధవ ! నువ్వు బాగా రాయకుండా నన్నంటావు"

" ఎలా రాయబుద్ధి అవుతుంది సార్ ! అక్కడ కాపీలు జరుగుతుంటే టీచర్లు పట్టించుకోవడం లేదు. గుసగుసలాడుతూ మాట్లాడుకుంటున్న నిశ్శబ్దం అని చెప్పడం లేదు. నా కాన్సంట్రేషన్ దెబ్బతింది మరి. పైగా నేను అంత కష్టపడి చదివి సాధించేదేముంది? నాకంటే తెలివి తక్కువ వాళ్లు ఎక్కువ మార్కులు కొట్టేస్తుంటే!"

" ఒరేయ్ ! శ్రీనాథ్ ! వాళ్లకు ఎక్కువ మార్కులు వచ్చినా అవి వాళ్ల స్వంతం కాదురా ! నీవి కష్టార్జితం!"

" కాని బయటకు అవి తెలియవు కదా సార్ ! చివరికి పేపర్లో వచ్చేది పర్సెంటేజీ, ఫోటో వేశారు సార్. ఇంకెందుకు చదవాలి?" శ్రీనాథ్ బాధపడ్డాడు.

ఏం చెప్పాలో తోచక ఇంటికొచ్చేశాడు శ్రీనివాస్.

పేపరు తెరిస్తే పెద్దక్షరాలతో స్కూల్ అడ్వర్టయిజ్‌మెంటు మా స్కూలు ఇంతశాతం

సాధించింది. మా పిల్లలు సరస్వతీ పుత్రులు. మా స్కూల్లో చదవండి అని. కేబుల్ టీవీ పెడితే అదేగోల... మా స్కూలు బెస్ట్ అని.. .

కాని ఆ వూళ్లో గొప్ప ర్యాంకులు సాధించిన స్కూళ్లన్నీ కూడా ఇదే దారిన పయనించాయని శ్రీనివాస్‌కు తెలుసు.

రాత్రి పడుకున్నాడో లేదో... రమేష్ వచ్చాడు కంగారుగా.

" ఏంటి గురూ ! ఈ టైంలో వచ్చావు?"

" ఏం లేదు. మన శ్రీనాథ్‌కు సీరియస్‌గా ఉంది"

" ఏమైంది? పొద్దున్న బాగానే ఉన్నాదే!"

" ట్యాబ్లెట్లు మింగాడట. వాళ్ల నాన్న నిద్రకని రోజూ వేసుకుంటాడట. అవి చాలా మింగేశాడట మధ్యాహ్నం. వాళ్లు ఇందాక చూసుకున్నారు నిద్రపోయుంటే. చూసొద్దాం పద"

దారిలో అడిగాడు శ్రీనివాస్ రమేష్‌ను.

" ఏం వాళ్లింట్లో ప్రాబ్లెమ్స్ ఉన్నాయా? శ్రీనాథ్ ఎందుకు ఆత్మహత్యకు పూనుకున్నాడు?"

"దానికి కారణం మనమే! అతనికి రావల్సిన ర్యాంకు తప్పిపోయింది. ఇంటా బయటా అందరూ హేళన చేశారట. ముందునుంచి అతను డిస్ట్రిక్ట్ ఫస్ట్ వస్తాడని మనవాళ్లంతా బూస్టప్ చేస్తూ వచ్చారు. వాళ్లమ్మా వాళ్లు కూడా అదే అందరితో చెప్పుకున్నారు. తీరా రిజల్ట్ వచ్చేసరికి ఇలా జరిగింది. అవమానం భరించలేక వాళ్లవాళ్లు నాలుగు మాటలన్నారు. అసలే కుమిలిపోతున్న శ్రీనాథ్ ఆవేశంతో ట్యాబ్లెట్లు మింగేశాడు" చెప్పాడు రమేష్.

శ్రీనివాస్‌కు బుర్ర వేడెక్కిపోయింది.

ఆసుపత్రికి వెళ్లేసరికి ఇంకా పూర్తి స్పృహలోకి రాలేదు శ్రీనాథ్! సెలైన్ ఎక్కిస్తూ వున్నారు. అప్పటికి స్టమక్ వాష్ అయిపోయింది. బాధగా మూలుగుతున్నాడు.

" నాన్నగారు ! నేను ఈ స్కూల్లో చదవను. నన్ను ఇక్కడ చేర్పించవద్దు. కాపీలు కొట్టని కాలేజీలో చేర్పించండి"

శ్రీనాథ్ తండ్రి రాజేష్ శ్రీనివాస్‌కు విష్ చేశాడు. తల్లి శ్రీదేవి ఏడ్చింది.

" సారీ ! మనం అవినీతి సమాజంలో బ్రతుకుతున్నాం. ఆ అవినీతిని ఎదురించిన వాడు ఉత్తముడు. ఆ అవినీతి వలలో చిక్కుకోకుండా వున్న వాడు మధ్యముడు. ఆ అవినీతిని ప్రోత్సహించేవాడు అధముడు' రాజేష్ చెప్పాడు.

' అయ్యో ! ఇలా ఎంతమంది శ్రీనాథ్‌లు ఉన్నారో' అనుకున్నాడు శ్రీనివాస్.

– ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 7-12-2002